
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# -50-

# "బద్ధకావధాని" కథ

అవధానం **అంటే** ఏకాగ్రత అని అందరికీ తెలుసు. అలా ఏకాగ్రతతో రాగాలు తీస్తూ ఒకాయనా, ఠకీ మని అప్పటికప్పుడే పద్య పాదం చెప్పగలిగిన మరొకాయనా, ఐదు నిముషాలు నిశ్శబ్దంగా కళ్ళు మూసేసుకుని ఈ సమస్య ని ఎలా పూరించాలిరా దేవుడా అని మరొక అవధాని గారూ ప్రార్థిస్తూ ఉంటారు. ఇలా ఎవరి పద్ధతి వారిదే. వీళ్ళందరూ ప్రసిద్ధి చెందిన అవధానులే. ఈ అవధానం చేస్తున్నప్పుడు వీరికి ఒక ప్రత్యేక ఆసనం, చుట్టూ ప్రశ్నలు అడిగే వారు...అందరూ వంది మాగధులూ, పంచె కట్టులూ, కుంకుమ బొట్లూ, మందీ మార్బలం, ఎదురుగుండా కుర్చీలలో పెద్దలు, సూటూ బూట్లతో నాయకులు, అసలు ఈ తంతంగం ఏమిటో చూద్దాం అనే కుతూహలం బేచ్ వాళ్ళూ ఆశీనులై ఉంటారు. ఇక అష్టావధానాని కి రెండు గంటలూ, ద్విగుణిత, త్రిగుణిత ఆవధానాలలకి మరో రెండు, మూడు గంటలూ, శతావధానానికి రోజంతానూ, సహస్రావధానానికి నెలంతానూ, పంచ సహస్రావధానానికి ఇంకెంతో – వద్దు లెండి..చెప్ప లేను. .. మనం ఇలాంటి లెక్కల్లో వీక్...వీక్ అంటే వారం అని కూడా అర్థం కదా. ఎందుకో కానీ ఈ అవధానులందరూ అలా బుద్ధిగా కూచున్న బద్ధకస్తులేమో అనిపిస్తారు. అలా అనిపించడానికి కారణం నేనూ ఒక బద్ధకావధానినే....అదెలా అంటే.....

మన సంగతి మిగతా అవధానుల్లా కాదు. ఉన్నది ఒక కుర్చీ, ఎదురుగుండా బల్ల మీద ల్యాపు టాపు, పక్కనే సెల్లు ఫోనూ...ఇవే నా నోరు లేని పృచ్ఛక వర్గం...నోరు లేక పోయినా వాటిని పృచ్ఛకులు అనేసుకుంటే నేను అవధానిని అయిపోయినట్టే...అంటే నా పాలిటి బాండు మేళం. నా అవధానానికి సమయమూ, సందర్భమూ ఉండదు. పగలూ, రాత్రీ ఉండదు. గణాలూ, యతులూ, ప్రాసలూ ఉండవు....ఉత్త వ్యయ ప్రయాసలు తప్ప...ఇక ఈ మధ్య ఒక వారం మన అవధాన కార్యక్రమం ఎలా జరిగిందో చూద్దామ్. ఇంట్లోనే కదా అని గళ్ళ లుంగీ, పైన మామూలు చొక్కా మాత్రమే నా ఆహార్యం. బొట్టూ లేదు, వీభూదీ లేదు.

పొద్దున్నే నా అవధానం సుమారు "వంద మైళ్ళ పరుగు' తో మొదలవుతుంది.,,అనగా రోజూవచ్చే వంద కి పైగా మైళ్ళు కాని మైళ్ళు ..అనగా ఇమెయిళ్ళు. వాటిల్లో అధిక భాగం అప్పటికప్పుడు తకీమని "నన్ను తొలగింపుము" బాపతే...అంటే మనకి అవి ఎందుకు వచ్చాయో ఆ పంపించిన వాళ్ళకి కూడా తెలియదనమాట. "నిన్న రాత్రి నిద్రపట్టక నిద్ర పట్టకపోవడం మీద ఈ కవిత వ్రాశాను. చదివి మీ అభిప్రాయం చెప్పండి. మీ పత్రిక లో వెయ్యండి" బాపతు కొన్ని. ఆ కవి వాడికి నిద్ర పట్టక పోతే ఆ శిక్ష నాకా? పొరపాటున ఆ కవిత చదివితే రెండు రోజులు నాకు నిద్రపట్టదు. ఇక నాకున్న ఒక రోగం..ఎవరైనా నాకు ఒక ఇమైల్ పంపిస్తే వెంటనే ఏదో విధంగా సమాధానం పంపిస్తాను....కనీసం "అందింది" అనో, "ధన్యవాదాలు" అనో ..."బాబోయ్, నన్ను చావగొట్టకండి" అనో.....ఎందుకంటే నేను పంపించిన ఉత్తరాలకి అలాగే సమాధానం రావాలని కోరుకుంటాను మరి! అంచేత...అన్ని ఇమైళ్ళ కీ ఏదో ఒక సమాధానం రాసి పంపించడం నా వారావధానం లో ప్రతీ రోజూ జరిగే మొదటి ఆవృత్తం.

ఇక రెండోది ఈ వాట్సాప్ అనే దారుణాస్త్రం....అందులో ఉన్న "గుంపులో గోవింద రోగం". అస్సలు నా ప్రమేయం లేకుండానే, నన్ను అడక్కుండానే నన్ను వాళ్ళ భజన బృందం లోకి కలిపేసుకున్నవి యాభై యో వందో వాట్సాప్ గుంపులు నా మీద చేసే దాడి దారుణాతి దారుణం అనే చెప్పుకోవాలి. ఇంచు మించు అన్నీ సా'హత్యం' గుంపులే కాబట్టి మనది అడకత్తెర లో పోక చెక్క లాంటి పరిస్థితి. సాహిత్యం కాబట్టి ఆ గ్రూప్ నుంచి తప్పుకోనూ లేమ్, అలా అని ఆ హింస భరించా లేమ్.....ఇకా వారానికి రెండూ, మూడూ సార్లు ఆ వాట్సాపు తెరవగానే "మీ ఫోన్ లో సరుకు నిండుకున్నది. వెంటనే స్టోరేజీ పెంచుకొనుము. లేదా అడ్డమైన చెత్త వీడియోలు, ఫొటోలు తొలగింపుము"..ఈ తొలగింపుడు కార్యక్రమం మళ్ళీ మొదలు.

మధ్యే మధ్యే సెల్ ఫోన్ మోగుట.....ఈ మధ్య వస్తున్న ఫోన్ పిలుపులు అన్నీ రోబో ల నుంచే కాబట్టి, అదిన్నీ ఆ చవక బారు నీలం మాత్రలు అమ్మే ఫార్మసీ వారి నుంచే కాబట్టీ మనకి తెలిసిన వారి పేరు కనపడితే తప్ప ఫోన్ ఎత్తడం మానేసినా, అప్పుడప్పుడు అనుకోకుండా దొరికిపోతున్నాను. వారిని ఆపే శక్తి నాకు లేదు అని ఎప్పుడో అర్థం అయిపోయింది. ఇందులో ఒకే ఒక అదృష్టం ఏమిటంటే....అలాంటి ఫోన్లు రాత్రి పూట రావు....

ఈ ఇమైల్, వాట్సాప్, మధ్యే మధ్యే ఫోన్ తతంగాలు మూడు, నాలుగు గంటల ఏకాగ్రత తో చేసి వారానికి కావలసిన కూరల కోసం కారు తీయగానే అది ఒకటే గోల "ఆయిల్ మార్పు సమయము వచ్చినది. విన్నావా, నీ కారులో తైలము మార్చుము. మరొక యాభై మైళ్ళు మాత్రమే సమయం"...అంతే కూరలు లేదు, నా బొందా లేదు. ముందు మా కారు మెకానికి మైక్ టేట్స్ దొర దగ్గరకి....వెళ్ళి "మైకబ్బాయ్, తైలం మార్చు" అనగానే వాడు "అవశ్యం" అనేసి కారు లోపలికి తీసుకెళ్ళి "సారూ, ఉత్తి ఆయిల్ మార్పిడే కాదు, ఒక టైరూ, ఫిల్టరూ, ఫింకూ, బెల్టూ..ఇవన్నీ కూడా మరణ శయ్య మీద ఉన్నాయి. ఎంతో కాదు కేవలం నూట తొంభై తొమ్మిది డాలర్లు మాత్రమే. క్రెడిట్ కార్డా, కేషా?" – దాంతో మరో

గంటన్నరా...అక్కడి షాప్ లో లోపల వాడు రిపేరు పనిలొ ఉండగా, నేను ఆ లాబీలో కూచుని ల్యాపు టాపు లో రోజు వారీ కార్యక్రమం లో భాగం గా ఫేస్ బుక్ లో లాగ్ ఇన్ అవగానే షాకింగ్ వార్త...

ఇవాళ నా పుట్టిన రోజుట కదా. ఫేస్ బుక్ వాళ్ళు నాకు తప్ప ప్రపంచం లో అందరికీ చెప్పినట్టున్నారు. వందలాది మిత్రులు అనేక రకాలుగా "నీ వయస్సు నిండా పదహారే" అంటూ కొందరూ "అన్నేళ్ళొచ్చినా నీ అంతట నువ్వే నీళ్ళు పోసుకోగలుగుతున్నందుకు సంతోషం" అని కొందరూ..ఎంతో అభిమానంతో పుట్టిన రోజు శుభాకాంక్షలు పంపిస్తే మనం కనీసం వాళ్ళకి ఒక లైక్ అన్నా కొట్టాలి గా....ఒక్కొక్క లైకు కొట్టుడుకీ ఒక క్షణం సమయం వేసుకున్నా హాయిగా రోజంతా గడిచిపోతుంది....ఏకాగ్రంగా....అదొక అవధాన ప్రక్రియ...ఇదొక ఫేస్ బుక్ లోనే కాదు...అటు ఇమైల్, వాట్సాప్ లలో మరి కొన్ని గ్రీటింగ్స్...వారికీ మరి ధన్యవాదాలు చెప్పుకునే లోపుగా ఆ సంతోషాన్ని భగ్నం చేస్తూ మా మైక్ టేట్స్ గాడి కేక "నీ కారు తయారు గా ఉన్నది. డబ్బు చెల్లించి తాళాలు తీసుకొనుము. హేపీ బర్త్ డే", మిస్టర్ వంగూరీ" –వెధవ రెండు వందల డాలర్ల నవ్వూ, వాడూను....వాడికెలా తెలిసిందో మరి. ఈ రోజుల్లో ఏదీ ఎక్కడా దాచలేమ్ కదా!.

కారు పని అయ్యాక ఇక కూరలు రేపు కొనుక్కుందాం లే అని బద్ధకించి ఇంటికి వెళ్ళిపోగానే "ఏం, మొగుడూ, ఖాళీ చెతుల్తో వచ్చావ్? కూరలు దొరకలేదా?" అని మా క్వీన్ విక్టోరియా వెటకారం. కారు సంగతి చెప్పగానే "అయితే నో మామిడి కాయ పప్పూ, చేమ దుంపల వేపుడూ..మరో వారం ఆగాల్సిందే. అంత వరకూ అవకాయే. తెలుసుగా. వారానికి ఒకసారి మాత్రమే వంట చెయ్యబడును. అదే వారం అంతా తినబడును"..అని విసురుగా వంటింటి నుంచి ఎక్కడికో పారిపోవుట. ఈ సమస్యా పరిష్కారం కూడా అవధాన ప్రక్రియలో ఒక భాగమే.

అంతలోనే మా సుపుత్రుడి రంగ ప్రవేశం....ఆస్టిన్ నుంచి...వస్తూనే "ఐ హేవ్ గ్రేట్ న్యూస్..ఆల్ సెట్" అని వాడు మూడు నెలల నుంచీ కష్టపడి తయారు చేసిన ఒక సొంత కంపెనీ బిజినెస్ ప్లాన్ వాడి ల్యాప్ టాప్ లో నా ముందు పెట్టాడు...చెప్పొద్దూ.....నేను కూడా మొదటి నించీ అదంతా చూస్తూనే ఉన్నా, అంతా కలిపి వాడు విడుదల కి తయారుగా చేసిన ఆధునికంగా, కావలసిన సమాచారంతో ఆ వెబ్ సైట్ బావుంది అనిపించింది. 6వ తరగతి నుంచి 12వ తరగతి దాకా అమెరికాలో విద్యార్థులు...ఆ మాటకొస్తే ప్రపంచం లో ఎక్కడ ఉన్న వారైనా తమ సామర్ధ్యత ఏ రంగంలో ఉందో శాస్త్రీయంగా గుర్తించి వాళ్ళకి తగిన దిశా నిర్దేశం చెయ్యడమే మా అబ్బాయి సాంకేతిక ప్రణాళిక. దానికి ఒక ప్రత్యేకమైన సాఫ్ట్ వేర్ తనే రూపొందించాడు. ఈ ప్రణాళిక అంతా నేను చాలా ఏకాగ్రత తో చదివి మా అబ్బాయిని సరి అయిన దారిలో నడిపించవలసిన బాధ్యత నాదే కదా!. ఇది న్యస్తాక్షరి లాంటిది....అంటే ప్రతీ విద్యార్థికీ ఏయే పాఠ్యాంశాలలో ఎక్కడ సరి అయిన స్థాయి ఉందో తెలుసుకుని మొత్తం విద్యాభ్యాసం చేయించడం. అప్పుడప్పుడు ఇందులోనే నిషిద్ధాక్షరి కూడా అన్వయిస్తుంది కదా!.

అన్నట్టు....వంగూరి సంస్థ నిర్వహించిన 26వ ఉగాది ఉత్తమ రచనల పోటీ విజేతల ప్రకటన పత్రికా ముఖంగా విడుదల చెయ్యాలి కదా....అదెప్పుడూ? ఆ పోటీ లోపాల్గొన్న అనేక దేశాల రచయితల ప్రశ్నలకి మరి సమాధానం చెప్పాలి కదా. రేపంతా ఆ పని మీద ఉందాం.

అలా అనుకునే లోగానే ఒకానొక ఆత్మీయ మిత్రుడి నుంచి వాట్సాప్..."సెప్టెంబర్ లో తలపెట్టిన రవిగాంచిన పోతన భాగవతం ఆణిముత్యాల పద్య పఠన పోటీ గురించి మాట్లాడాలి. వెంటనే ఫోన్ చెయ్యి." ఇక్కడ మాట్లాడాల్సిన విషయాలు ఒకటా, రెండా...ముందు ఏయే దేశాల వారి స్పందన ఎంత వరకూ వచ్చింది? ...అన్నట్టు పార్థు నేమాని భక్తి టీవీలో ప్రసారం చేస్తున్న "పలికెద భాగవతం"– మూడవ సంచికకి ఇంకా ఎంత డబ్బు మనం పంపించాలి? ఎలా సంపాదించాలి? – గంటన్నర సేపు ...

ఆ మాటకొస్తే రాత్రి 11:00 దాటాకే నా నిశాచర వ్యాపకాలు ప్రారంభం అవుతాయి....అంటే అటు ఆస్ట్రేలియా నుంచి సింగపూర్, ఇండియా, ఇటు ఇంగ్లండ్ లలో జరిగే సాహిత్యప్పనులూ క్షమించాలి...సాహిత్యప్పనులూ....ఎప్పుడైనా అందరి దగ్గరా చందాలు వసూలు చేసి తలపెట్టిన సమాజం పనులూ ...ఇలాంటివనమాట... ఇవి అయ్యేటప్పటికి కనీసం రాత్రి ఒంటి గంటన్నర అవుతుంది. ఈ సమయం లోనే అత్యంత అనాసక్తరమైన, పేలవమయిన...ఆపుడప్పుడు జుగుప్సాకరమైన అంశాల తోటీ, మన రాజకీయ దౌర్భాగ్య నాయకుల ప్రేలాపనలతోటీ, సినిమా వారి వెకిలి వేషాల తోటీ ఏదో టీవీ 5, టీవీ 9, ఆంధ్ర జ్యోతి లాంటి చానెల్స్ చూస్తూ అటు పవిత్ర భారత దేశం సమాచారాలు తెలుసుకుంటూనే ఉంటాను. అలా అని అమెరికా టీవీలో వార్తలు చూడకుండా ఎలా? ఎప్పుడు చూసినా బైడెన్ వాళ్ళు ఇంకా ట్రంప్ ని తిట్టడం, ట్రంప్ వాళ్ళు బైడెన్ నీ, కమలా ఆంటీ ని కలిపి తిట్టడం, తెల్ల పోలీస్ నల్ల వారిని "కాల్చుకు తింటున్న" వార్తలు...ఒకటేమిటి...అన్నీ గమనిస్తూ, నిట్టూరిస్తూ మన అవధానం మనం ఏకాగ్రతతో చేసుకుంటూ పోవడం....

ఇక ఒక రోజు కాకినాడ నుంచి మా వేలువిడిచిన మేనల్లుడి "తప్పించుకున్న పిలుపు"..అంటే మిస్స్ డ్ కాల్.... వాడు ఎప్పుడైతే ఫోన్ చేసి, ఒకటో, రెండో రింగ్ లు అవగానే ఠకీ మని పెట్టేస్తాడో అప్పుడే దాని అర్థం నాకు తెలుసు. తెలియనిది అల్లా....వాడికి ఇవాళ ఎంత కావాలీ అనేదే. డబ్బు కావలసి వచ్చినప్పుడే మిస్స్ డ్ కాల్. అదీ వారానికో సారి... ప్రస్తుతం కాకినాడ దగ్గర చిన జగ్గంపేట & దొంతమ్మూరు గ్రామాలలో మేము తలపెట్టిన రెండు మంచి నీళ్ళ సదుపాయ ప్రణాళికలు ...అనగా వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్– లకి కావలసిన సవా లక్ష సదుపాయాలకి..అనగా....స్థలం తయారు చేసి, అక్కడ చదును చేసి సిమెంట్ వేసి తయారు చేయుట, సరి అయిన చోట బోర్ వెల్ కొట్టుట, పంపులు మరియు పైపులు బిగించుట, ఆ కంపెనీ వారిని సంప్రదించుట, చిన్నప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలో నాతో చదువుకున్న యనమండ్ర సూర్యనారాయణ మూర్తి సహాయం తో అన్ని ఇంజనీరింగ్ డిజైన్ పనులూ సరిగ్గా అమలు చేయుటా... వీటన్నన్నింటికీ కావలసిన సొమ్ము ఘనత వహించిన మా ఐసిఐసిఐ బ్యాంకు వారి ద్వారా మా మేనల్లుడికీ, ఆ కంపెనీలకీ పంపించే

ఏర్పాట్లు చేయుటా....అవును రాత్రి పదకొండు దాటాకే....గత ఐదు నెలలగా ఈ నీటి సదుపాయం ప్రాజెక్ట్ పని అవధానాన్ని మించిన పనే...

ఈ తతంగం లో ఉండగా...వాట్సాప్ లో "వు ఆర్ వైటింగ్, సర్" అనే అర్జంట్ మెసేజ్ ఇండియా నుంచి...హారినీ అమెరికా సమయం రాత్రి 10:30 నుంచి...అనగా ఇండియాలో ఉదయం 9:00 గంటల నుంచీ మొదలయ్యే ఒకానొక వర్ధంతి, లేదా, జయంతి, లేదా ఏదో ఒక 'సాహత్య' సమా 'వేషం" లో ప్రారంభ, విశిష్ట, ప్రధాన బాపతు ఏదో ఒక అతిధిగా మాట్లాడమని వారెవరో అడగడం, నేను ఒప్పుకోడం, ఆ పిమ్మట మర్చిపోవడం, ఇలా వాళ్ళు గుర్తు చేస్తూ వాపోవడం...ఈ మధ్య చాలా సార్లే జరుగుతోంది...అంటే అవధానం లో ధారణ సమయం లో ఒక పద్య లో ఒక పాదం మర్చిపోవడం లాంటిది అనమాట. అప్పుడు మిగతా పనులు అన్నీ కట్టేసి, జూమ్మంటూ ఆ జూమ్ లోకి వెళ్ళి పోయి అందులో పొగడవలసిన నిర్వాహకులనీ, ఆ దివంగత ప్రముఖులనీ పొగిడేసి, లేదా కాస్సేపు ఏదో ఒక అప్రస్తుత్త ప్రసంగం చేసేసి మళ్ళీ డ్యూటీ లోకి వచ్చెయ్యడం కూడా పరిపాటి. కరోనా ధర్మమా అని ఈ జూమ్ సమావేషాలకి అంతూ, పంతూ లేదు కదా!.

ఇంతలో మరొక ఫోన్....నెంబర్ ఎవరిదో తెలియదు కాబట్టి ఫోన్ ఎత్త లేదు...అప్పుడు ఫోన్ లో మెసేజ్.."రాజు అంకుల్. దిస్ ఈజ్ బిందు. ప్లీజ్ లిఫ్ట్ ది ఫోన్". నన్ను అలా పిలిచే బిందు అనే ఒకే ఒక అమ్మాయితో నేను మాట్లాడి 30 ఏళ్ళు పైగానే అయింది. "హారినీ, బిందూ" అని వెంటనే తిరిగి ఫోన్ చెయ్యగానే బిందు గద్గద స్వరంతో "రాజు అంకుల్, మా నాన్న పోయారు..నిన్న బొంబాయి లో". నేను నిర్ఘాంత పోయాను. వాళ్ళ నాన్న అంటే నేను బొంబాయి ఐఐటి లో ఉన్న ఎనిమిదేళ్ళూ నాకు అత్యంత ఆప్తుడు అయిన ప్రొఫెసర్ టి.ఆర్.అర్.మోహన్. ..అనగా తల్లాప్రగడ రాజా రామ్ మోహన్. వాడు మెటలర్జీలో డాక్టరేట్ చేసి, అక్కడే లెక్చరర్ గా చేరి, ప్రొఫెసర్ గా రిటైర్ అయి రెండో కూతురు రేఖ తో ఉత్తర బొంబాయి లో థాణే లో ఉంటున్నాడు. మోహన్ నీ, అతని అర్ధాంగి సుబ్బలక్ష్మి నీ చూసి పాతికేళ్ళు దాటింది. నేను బొంబాయిలో ఉన్నప్పుడు పుట్టిన పెద్దమ్మాయి అయిన ఈ బిందూ నా భుజాల మీద పెరిగింది. ఇప్పుడు కెనడా నివాసి. "రాజు అంకుల్...మనం కలిసి చాలా ఏళ్ళు అయినా...మా నాన్న, అమ్మ, నేనూ మీ గురించీ, మీ అందరూ కలిసి ఆడిన నాటకాలు, పాడిన పాటలు, చేసిన నృత్యాలూ అన్నీ ఎప్పుడూ తల్చుకుంటూనే ఉంటాం. య ఆర్ అల్వేస్ ఇన్ అవర్ కాన్ వర్ సేషన్. అందుకే మీకు మొందు ఈ వార్త చెప్తున్నాను." అంది బిందు. మోహన్ కి న్యుమోనియా వచ్చి, హాస్పిటల్ లో చేరితే కోవిడ్ వచ్చిన వారికే ఆక్సిజన్ ఇస్తాం, మీరు ఇంటికి వెళ్ళిపోవచ్చు అన్నారుట ఐసీయూ లో. తీరా టెస్ట్ చేస్తే కోవిడ్ పాజిటివ్. అంతే...అతడిని కుటుంబానికి కనపడకండా గవర్నమెంట్ కంట్రోల్ లో దూరంగా పెట్టారుట. అప్పటికీ ఆక్సిజన్ సప్లై లేక ప్రాణాలు కోల్పోయిన ఈ ప్రొఫెసర్ ఎమిరటస్ ఆఫ్ ఐఐటి, బొంబాయిని అక్కడి నించి ప్రభుత్వం వారి ఎంబ్యులెన్స్ లో దహనశాలకి తరలించారుట. 28 డాక్టరేట్లని తయారు చేసి, అతని పేరిట మెటలర్జీ డిపార్ట్ మెంట్ లో ఒక

"చైర్" ని ఏర్పాటు అయిన మా మోహన్  తన శరీరాన్ని ఏదైనా హాస్పిటల్ కి కానీ మెడికల్ కాలేజ్ కి కానీ దానం చేసిన ఆఖరి కోరిక తీరనే లేదు. ఎందుకంటే కోవిడ్ సోకిన శరీరాన్ని తీసుకోడానికి ఎవరూ అంగీకరించ లేదుట. మోహన్ మరణ వార్త వినగానే బొంబాయిలో రేఖ తోటీ, లక్ష్మి తోటీ మాట్లాడాను. దురదృష్టవశాత్తూ ఆ ఇద్దరూ కూడా క్వారంటీన్ లోనే  ఉన్నారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా మా మిత్రులందరినీ కూడగట్టుకుని, విషయం పంచుకుని, మరో కొద్ది రోజుల్లో మా అందరి జ్ఞాపకాలు పంచుకునే సమావేశం ఏర్పాట్లు చెయ్యడం మొదలు పెట్టాను. ఆ విధంగా కూడా మోహన్ మమ్మల్ని అందరినీ మళ్ళీ కలిపాడు...అప్పటి లాగానే. భారత దేశం లో కోవిడ్ రెండోసారి విజృంభణకి ఇది ఒక నిదర్శనం...

ఇక అన్నింటికన్నా అతి ముఖ్యమైన పని, ఏకాగ్రత తో చెయ్య వలసిన అనేక పనులూ గత నెల్లాళ్ళగా..ఏమిటంటే... మా పెద్దమ్మాయి పెళ్ళి కుదరడం,  మే నెల 8, 2021 కి ముహూర్తం పెట్టడం.... పెళ్ళి పనులు ముమ్మరంగా సాగుతూ ఉండడం.. జరుగుతూనే ఉన్నాయి. అయితే కోవిడ్ ధర్మమా అని కల్యాణ మండపం వారు పెట్టిన అనేక నియమాలు పాటించి కేవలం కుటుంబ సభ్యులలో కూడా అతి తక్కువ మందిని మాత్రమే మా అమ్మాయి పెళ్ళికి పిలవగలుగుతున్నాం. పెళ్ళి కొడుకు అమెరికా అబ్బాయి అయినా ఆవకాయ అంటే ఆత్రంగా తినేవాడే కాబట్టి పెళ్ళి మన సాంప్రదాయ పద్ధతిలోనే చేస్తున్నాం. మా రెండో అమ్మాయి పెళ్ళి ఏడేళ్ళ క్రితం సుమారు 800 మంది అతిధులతో వైభవం గా జరిగింది. ఇప్పుడు ఇద్దరు మనవరాళ్ళు.

అన్నట్టు మొన్న ఉగాది కి చైత్రమాసం వచ్చింది కదా.....ఆ మధ్య గడ్డ కట్టుకు పోయే శీతాకాలం లో మా పెరట్లో మొక్కలు ఇంచుమించు అన్నీ చలి చావు చచ్చి పోయాయి. చచ్చినట్టు మళ్ళీ అన్ని పూల మొక్కలూ కొనుక్కురావడం, నాలుగు వంగ మొక్కలు వేయడమ్.....అవధానం లో మరొక అధ్యాయం...అది కాస్త వివరంగా మరొక సారి వ్రాస్తాను.

అన్నట్టు మర్చేపోయాను...నిజంగానే మర్చిపోయాను. మధ్యలో ఒక రోజు మా పెళ్ళి రోజు ట...ఎవరో వచ్చి టెంకి జెల్ల కొట్టి నన్ను ఒక రెస్టారెంట్ కి లాక్కుని వెళ్ళి పండగ చేశారు. ఎవరో ఏమిటి లెండి...అవిడే!..ఆవిడా, మా పిల్లలూనూ...అదొక ఆత్మీయ జ్ఞాపకం.....ఆ రోజు తిన్న ఊతప్పం...మైసూరు పొడి తో..

అన్నట్టు మర్చిపోయాను...రాత్రి ఒంటి గంటన్నరకి మళ్ళీ ఫోన్ ..ఈ సారి అది ఇండియా నెంబర్ ..+91 తో మొదలయింది కదా...అని ఫోన్ ఎత్తగానే "సార్ , నేనూ సత్యా రెడ్డిని, గుర్తు ఉన్నానా?" అని అత్యంత నీరసంగా ఒక గొంతుక నన్ను పలకరించింది. ఎప్పటిలాగానే నాకు ఆయన ఎవరో గుర్తు లేదు. "మీరు ఇరవై  ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చినప్పుడు మీ నెంబర్ నా డైరీలో రాసుకున్నాను. కవిత్వం రాస్తాను. సాహిత్య పరిషత్ నాదే. గుర్తొచ్చానా?" ఇంకా నీరసంగా ఆయన చెప్పినా నాకు గుర్తు రానే లేదు కానీ "చెప్పండి సార్  ఎలా ఉన్నారు?" అని అడిగాను. "ఏం చెప్పను సార్...మీకు తెలుసును కదా. ఏదో పెన్సన్ మీద బతుకుతున్న తెలుగు టీచర్ ని.  కిందటి నెల కోవిడ్ అనుకుని ఒక ప్రైవేట్

హాస్పిటల్ లో చేరాను సర్. ఆ వెధవలు పది హేను రోజులు ఉంచుకుని, ఎనిమిది లక్షలు గుంజుకుని "నీది కోవిడ్ కేస్ కాదు" అని ఇంటికి పంపిచేశారు సార్. మరి నా డబ్బులు నాకిచ్చెయ్యమంటే ఫోన్ కట్ చేసేస్తున్నారు. సర్ నేను ఆరోగ్యం కుదుట పడడానికి ఆయుర్వేదం ట్రీట్ మెంట్ మొదలు పెట్టాను సర్. అది బాగానే పని చేస్తోంది సర్. కానీ నెలకి పదిహేను వేలు చొప్పున ఆరు నెలల కోర్స్ సర్. నా దగ్గర డబ్బు లేదు సార్. మీరు ఏదైనా సాయం చెయ్యగలరా సార్. కనీసం ఒక నెలకి పదిహేను వేలు సార్. నేను నా పెన్షన్ లోంచి కొంచెం కొంచెం గా తీర్చుకుంటాను సర్.." ఇలా సాగిన ఆ సత్యా రెడ్డి గారి నుంచి మరో పది నిముషాలలో ఆయన ఎకౌంట్ వివరాలు నా ఫోన్ మెసేజ్ లో వచ్చాయి. "నాకు వాట్సాప్ లూ, ఇమైలూ లేవు సర్. బీద తెలుగు టీచర్ని, టెక్స్టింగ్ చెయ్యడం వచ్చు సర్" అన్నవి అందులో ఆయన చెప్పుకున్న సమాచారం. ఈ సమస్యని ఎలా పరిష్కరించాలి? ఈ సత్యా రెడ్డి చెప్పేది సత్యమా? అసత్యమా? పదిహేను వేలతో పరిష్కరించబడే సమస్య కాదు కదా ఇది? ఇలాంటి సత్యా రెడ్డి లా దోపిడీకి గురి అయిన అమాయకులు ఎంత మంది ఉన్నారు? ఇప్పుడెలా? నా అవధానం లో పరిష్కరించ లేని సమస్య గా ఇది మిగిలిపోయింది.

ఇన్ని పనులు అవలీలగానో, అవకతవకగానో చేస్తున్న నేను కూడా ఒక అవధాని నో, కనీసం అప్రస్తుత ప్రసంగి నో కదా!. వీటన్నింటికీ మధ్య నాకు ఇష్టమైన హాస్యావధానం ఎప్పుడూ సాగుతూనే ఉంటుంది...నిజానికి నేను చాలా బద్ధకస్తుడిని...బద్ధకావధానిని....కాదంటారా?

**COMMENTS**